క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు పర్యవేక్షించాలి



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గణపతి

దండేపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు ముందుకు సాగేలా, లబ్ధిదారులకు సూచించాలని జెడ్పీ సీఈవో గణపతి అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత ఉన్నారు.

ఎరువుల కొరత తీర్చండి



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

చెన్నూర్: చెన్నూర్‌లో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని కోరుతూ స్థానిక రైతులు మంగళవారం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. రైతులు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ఏనాడు ఎరువుల కొరత లేదన్నారు. డీఏపీ, యూరియా లభించక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డీఏపీ రూ.1390 ఉండగా రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని కొందరు డీలర్లు రూ.1500 నుంచి రూ.1550 తీసుకుంటున్నారని ఆరోపించారు. ఏవో కల్పనతో రెండు రోజుల్లో రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు తెప్పిస్తామని తెలిపారు. ఎరువుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. దీంతో రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల సందర్శన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అవినాశ్

లక్సెట్టిపేట: విద్యార్థులకు ప్రతీ రోజు రుచికరమైన భోజనం అందించాలని ప్రత్యేకాధికారి అవినాశ్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండాలని, వంట పాత్రలను ప్రతీ రోజు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పాఠశాల ఆవరణలోని పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, వార్డెన్ గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు'

బెల్లంపల్లి: క్షయ వ్యాధిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని బెల్లంపల్లి డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీ లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొని ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారని, రెండు వారాలకు పైగా దగ్గు ఉన్న, ఇతర లక్షణాలు కలిగిన వ్యక్తులు తప్పక పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, ఎన్‌వీహెచ్‌సీపీ జిల్లా ఇన్‌చార్జీ మధుబాబు, టీబీ సూపర్‌వైజర్ శశికాంత్, అకౌంటెంట్ మురళి, సిబ్బంది శ్రీలత, వినోద్‌కుమార్, అలేఖ్య, ఏఎన్‌ఎంలు స్వప్న, వసంత, సరిత తదితరులు పాల్గొన్నారు.

వస్తు ఉత్పత్తుల మేళా ప్రారంభం



మేళా ప్రారంభిస్తున్న కమిషనర్ రమేశ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వస్తు ఉత్పత్తుల మేళాను మంగళవారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100రోజుల ప్రణాళికలో భాగంగా 50రోజులను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని మేళాను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు రకరకాల వస్తువులను, తిను బండారాలను ప్రదర్శనలో ఉంచారు. పురప్రజలు ఆసక్తిగా తిలకించి అవసరమైన వస్తువులను కొనుగోలు చేశారు. డీఈఈ సాయికిరణ్, మున్సిపల్ ఆర్‌వో భుజంగరావు, మెప్మా, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగు నీరు

రాంనగర్‌లో రోడ్డుపై నిలిచిన డ్రెయినేజీ నీరు



గ్రీన్‌సిటీలోని రోడ్లపై గుంతల్లో నిలిచిన డ్రెయినేజీ నీరు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపైకి వస్తున్న డ్రెయినేజీ నీరు



మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగర పరిధిలోని డ్రెయినేజీలు పూడికతో నిండిపోవడంతో, వర్షపు నీరు డ్రెయినేజీలోకి వెళ్లి, రోడ్లపైకి వచ్చి నిలుస్తోంది. మంగళవారం కురిసిన వర్షానికి డ్రెయినేజీల్లోని నీటితో వర్షపు నీరు కలిసి, రోడ్లపైకి వచ్చి చేరింది. దీంతో పట్టణ ప్రజలకు దుర్వాసన రావడంతో పాటు, రాకపోకలకు కొంత ఇబ్బందిగా మారింది. మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న డ్రెయినేజీలో పూడికతీత చేపట్టకపోవడంతో, అందులోని నీరు రోడ్లపై పారుతోంది.

క్షీరాభిషేకం



జన్నారం: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

భీమారం/కాసిపేట/జన్నారం: జీవో నంబర్ 49రద్దు పై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కృష్ణారావు, సీతక్క, వివేక్, సురేఖ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జన్నారం, భీమారం, కాసిపేట మండలాల్లో క్షీరాభిషేకం చేశారు.

వసతి నిరుపయోగం



తాండూర్ ఎస్సీ బాలుర వసతి గృహం

- శిథిలావస్థలో ఎస్సీ బాలుర వసతి గృహం
- పట్టించుకోని అధికారులు

తాండూర్: తాండూర్ షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహం పక్కా భవనానికి అన్ని రకాల సౌకర్యాలు ఉండి కూడా, చిన్నపాటి మరమ్మతులు చేయించలేక నిరుపయోగంగా మారింది. శిథిల దశకు చేరుకొని అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

14 గదులు.. 100పైగా విద్యార్థులు..

ఎస్సీ బాలుర వసతి గృహం ఒకప్పుడు విద్యార్థులతో ఎంతో కళకళలాడేది. 14 గదులు, వంటశాల, స్టోర్ రూమ్, సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకు, బోర్‌వెల్ వంటి సౌకర్యాలతో 100కుపైగా విద్యార్థులతో కొనసాగింది. ఈ వసతి గృహంలో ఉంటూ తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు విద్యను అభ్యసించేవారు. కానీ ఇటీవలి కాలంలో సాంఘిక సంక్షేమ, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల వైపు విద్యార్థులు మొగ్గు చూపుతుండటంతో ఎస్సీ బాలుర వసతి గృహానికి ఆదరణ కరువైంది. ఈ కారణంగా వసతి గృహంలో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. భవనం కొన్నిచోట్ల పైకప్పు పెచ్చులు ఊడిపోవడంతో అప్పటి వరకు ఉన్న ఆ కొద్ది మంది విద్యార్థులు కూడా వసతి గృహం నుంచి వెళ్లిపోయారు. దీంతో రెండేళ్లుగా వసతి గృహం నిరుపయోగంగా మారింది.

వినియోగంలోకి తేవాలి



షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహాన్ని అధికారులు పూర్తి స్థాయిలో మరమ్మతు చేయించి వసతులు కల్పించి వినియోగంలోకి తేవాలి. విద్యార్థులు ఆసక్తి చూపకపోతే ఈ భవనాన్ని పక్కాగా తయారు చేసి, జూనియర్ కళాశాలకో, లేదా మరే వసతి గృహానికో వినియోగించాలి. శిథిలావస్థకు చేరితే కబ్జా అయ్యే ప్రమాదం ఉంది.

– శ్రీ కృష్ణదేవరాయలు, తాండూర్

ఉన్నతాధికారులు ఆదేశిస్తే పరిశీలిస్తాం

వసతి గృహ భవనం మరమ్మతు చేసేందుకు అనువుగా లేదు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే పరిశీలిస్తాం. ఒకవేళ విద్యార్థులు వస్తే ఏదైనా భవనం అద్దెకు తీసుకొనైనా హాస్టల్ కొనసాగించేలా చర్యలు తీసుకుంటాం.

– మల్లేషం, మండల విద్యాశాఖ అధికారి

స్పందించారు.. మరమ్మతు చేశారు



సాక్షి స్పందన

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట సమీపంలో కడెం డిస్ట్రిబ్యూటరీ 22వ కాల్వకు గండిపడి సాగునీరు వృథాగా పోయింది. దీనిపై మంగళవారం 'సాక్షి' జిల్లా ఎడిషన్‌లో 'కడెం డిస్ట్రిబ్యూటరీ కాల్వకు గండి' అనే కథనం ప్రచురితం కాగా, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. గండి పడ్డ చోట తాత్కాలిక మరమ్మతు చేసి, సాగునీరు వృథాపోకుండా చేశారు. మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ, టెండర్ కానందునా, పనులు చేపట్టడంలో ఆలస్యం అయ్యిందన్నారు. టెండర్ పూర్తయిన వెంటనే పూర్తిస్థాయి మరమ్మతు చేస్తామని ఇరిగేషన్ ఏఈ శ్రావణ్ తెలిపారు.

'భూ భారతి' సమస్యలు పరిష్కరించాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

నెన్నెల: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా వెంటనే సమస్యను పరిష్కరించాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఎలా పరిష్కరిస్తున్నారని తహసీల్దార్ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ దరఖాస్తుదారుడికి నోటీసు జారీ చేసి క్షేత్ర స్థాయిలో విచారణ చేసిన తర్వాత పరిష్కరించాలన్నారు. దరఖాస్తు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డుల వివరాలతో సరిపోల్చుకొని క్షేత్రస్థాయి విచారణను పకడ్బందీగా జరపాలన్నారు. సమావేశంలో డీటీ ప్రకాష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

25న గోదావరిఖనికి మంద కృష్ణ మాదిగ

శ్రీరాంపూర్: ఈ నెల 25న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ గోదావరిఖనికి వస్తున్నట్లు సింగరేణి మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొంకూరి మోహన్ తెలిపారు. సోమవారం రాత్రి నస్పూర్ కాలనీలోని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. గోదావరిఖనిలోని మార్కేండేయ కాలనీ ఆర్కే గార్డెన్‌లో నిర్వహించే సింగరేణి మాదిగ ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. మాదిగ ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సొప్పదండి దుర్గా ప్రసాద్, నాయకులు నేలవేణి కుమార్, చెరిపెల్లి సురేశ్, చిరంజీవి, మారుపెల్లి బాపు, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, డీకొండ స్వామి, రాంచందర్ పాల్గొన్నారు.

మెడికల్ కార్డుల పునరుద్ధరణకు అవకాశం

మందమర్రిరూరల్: సింగరేణి విశ్రాంత కార్మికులు వారికి సంబంధించిన మెడికల్ కార్డుల పునరుద్ధరణకు యాజమాన్యం అవకాశం కల్పించిందని, వెంటనే చేయించుకోవాలని ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం కీలకం

- జీఎం శ్రీనివాస్



ప్రశంసా పత్రం అందిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం (ఎస్అండ్‌పీసీ) కీలకపాత్ర పోషిస్తుందని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం శ్రీరాంపూర్‌లోని సెక్యూరిటీ డిపార్టుమెంట్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సెక్యూరిటీ సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రం అందించారు. వారి ధైర్య సాహసాలను కొనియాడారు. సెక్యూరిటీ విభాగం అవసరాల దృష్ట్యా నూతనంగా కొనుగోలు చేసిన ఫర్నీచర్‌ను కార్యాలయానికి అందజేశారు.

ఆర్థిక సాయం..

సెక్యూరిటీ విభాగంలో పనిచేసి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన డీ.శేఖర్ అనే సెక్యూరిటీ గార్డ్‌కు సెక్యూరిటీ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కలిసి రూ.70వేలు విరాళాలు సేకరించి జీఎం చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, సెక్యూరిటీ విభాగం అధిపతి జక్కారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు రాంరెడ్డి, రాజన్న, ఫిట్ కార్యదర్శి మల్లికార్జున్ పాల్గొన్నారు.

కార్మికులకు కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం క్వార్టర్ల కేటాయింపు కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలో 100క్వార్టర్లకు యాజమాన్యం నోటిఫికేషన్ వేయగా 275మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. సీనియారిటీ ప్రకారం 26మంది మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లోని కార్మికులకు క్వార్టర్లు కేటాయించినట్లు ఏరియా పర్సనల్ ఆఫీసర్ శ్యాంసుందర్ తెలిపారు. కౌన్సెలింగ్‌లో ఐఈడీ కిరణ్, ఎస్ఈ శ్రీధర్, సీనియర్ పీవో కార్తీక్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు ఉన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుపై హర్షం

శ్రీరాంపూర్: రాష్ట్రంలోని గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంపై ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగ్, నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బింగి సదానందం మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కార్మిక శాఖ మంత్రిగా గడ్డం వివేక్ వెంకటస్వామి బాధ్యతలు చేపట్టిన తర్వాత గిగ్ కార్మికులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారన్నారు. వారి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వారికి న్యాయం జరిగేలా ఒప్పించారన్నారు. దీంతో వారి సంక్షేమం కోసం ప్రభుత్వం నేడు బోర్డు ఏర్పాటు చేసిందన్నారు.

సమాచారం

● నేడు జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం హాల్లో బుధవారం ఉదయం 10గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 8 కంపెనీలకు చెందిన వివిధ రకాల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు, నిరుద్యోగులు సకాలంలో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

● నేడు విద్యాసంస్థల బంద్

బెల్లంపల్లి: రాష్ట్రంలో విద్యాసంస్థల బంద్‌ను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యాశాఖమంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలి

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు సహకరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు కోరారు. తెలంగాణలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్నా టీచర్, ఎంఈవో, డీఈవో, లెక్చరర్, ప్రిన్సిపాల్ పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలన్నారు.

● కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

నస్పూర్: పట్టణ పరిధిలోని కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం)లో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ ఎంపీసీ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లను ఈ నెల 23న స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మౌనిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 10సీట్లు, ఇంటర్మీడియెట్‌లో 15సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి కలిగిన వారు కేజీబీవీలో సంప్రదించాలని ఆమె సూచించారు.

● దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతి థి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంపీ.పట్వర్ధన్ తెలిపారు. ఇంగ్లిష్ బోధించేందుకు ఒక్క పోస్టు, తెలుగు ఒక పోస్టు, కామర్స్ 2, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ బోధించేందుకు రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులకు, బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో కనీసం 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 50శాతం మార్కులు ఉండాలన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, క్యాస్ట్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను ఈ నెల 24వ తేదీ సాయంత్రం 3.30గంటలలోపు కళాశాలలో అందించాలని తెలిపారు. 25న కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

● 31వరకు అవకాశం...

దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 31వరకు అవకాశం ఉందని జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, ఎంఈవో చిన్నయ్య తెలిపారు. దండేపల్లి ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన ప్రచార పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దండేపల్లి ఓపెన్ స్కూల్ సహాయ కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు, ఎంఐఎస్ నగేశ్, సీసీవో మల్లేష్, సీఆర్పీలు నర్సయ్య, రమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● 'బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం'

బెల్లంపల్లి: బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం వల్ల తెలంగాణకు తీరని జల నష్టం జరుగుతుందని, ఆ ప్రాజెక్టును అడ్డుకుని తీరుతామని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రాజెక్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు ఆడేపు అరుణ్, కార్యదర్శి సుమంత్, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఘనంగా జాతీయ జెండా దత్తత దినోత్సవం

పాతమంచిర్యాల/చెన్నూర్: జిల్లా కేంద్రంలో చెన్నూర్ రోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, చెన్నూర్ పట్టణంలోని కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలల్లో లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో జాతీయ జెండా దత్తత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ పతాక ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మంచిర్యాల శాఖ అధ్యక్షుడు కారుకూరి చంద్రమౌళి, కార్యదర్శి సుదాకర్ రెడ్డి, కోశాధికారి రామస్వామి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూదన్ రీజియన్ చైర్‌పర్సన్ కొత్త సురేందర్, చెన్నూర్‌లో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జాడి తిరుపతి, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

● పోస్టర్ ఆవిష్కరణ

నస్పూర్: నేటి సమాజంలో మహిళలకు చదువు చాలా ముఖ్యమని ఎంఈవో పద్మజ సూచించారు. ఓపెన్ స్కూల్లో అడ్మిషన్లలో భాగంగా సీసీసీలోని మెప్మా కార్యాలయంలో ఆర్పీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెప్మా కోఆర్డినేటర్ నాగరాజు, ఎస్ఆర్‌పీ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రేగళ్ల ఉపేందర్, సహాయ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఆర్పీలు పాల్గొన్నారు.

● భక్తిశ్రద్ధలతో గీతా హవన యజ్ఞం

నస్పూర్: పట్టణ పరిధిలోని షిర్కేకాలనీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అర్ధశాత్రమాస్య దీక్షల సందర్భంగా శ్రీమద్భగవద్గీత సత్సంగం సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గీతాహవన యజ్ఞాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భగవద్గీతలోని 7వ అధ్యాయం నుంచి 12వ అధ్యాయం వరకు గీతాపారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దాసరి రాజేశం, కన్వీనర్ ప్రసాద్, కార్యదర్శి రాంబాబు, సభ్యులు రాజేశం, శంకర్, రాజేశ్వరి, స్వర్ణకుమారి, వినోద, శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని దొనబండ, సబ్బెపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో లక్సెట్టిపేట మండలంలోని జెండావెంకటపూర్, లక్ష్మీపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్కూల్ కిట్ల బ్యాగులను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీజేపీ నాయకుడు రఘునాథ్ అందజేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● కేరళ మాజీ ముఖ్యమంత్రికి నివాళి

పాతమంచిర్యాల: కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం దిగ్గజం అచ్యుత నందన్ సోమవారం మృతి చెందడంతో జిల్లా కేంద్రంలో మంగళవారం సీపీఎం నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి సంకె రవి, ప్రధాన కార్యదర్శి రంజిత్, నాయకులు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జన్నారం: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గొర్రె శాంతయ్య కువైట్‌లో చిక్కుకున్న విషయాన్ని తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం శాంతయ్యతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం కల్పించారు. వారి కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే అందజేసిన ఆర్థిక సాయం రూ.10వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

● బద్దంపల్లిలో వనమహోత్సవం

వేమనపల్లి: మండలంలోని బద్దంపల్లి గ్రామంలో మంగళవారం నీల్వాయి రేంజ్ అధికారి అఫిజోద్దీన్ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట మొక్కలు నాటారు. బద్దంపల్లి ఎఫ్ఎస్‌వో స్వామి, ఎఫ్‌బీవో మధుకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ముందస్తు అరెస్ట్

జన్నారం: తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ రాష్ట్ర కమిటీ చలో గన్ పార్క్ పిలుపు మేరకు మంగళవారం ఉద్యమకారుడు కమ్మల విజయధర్మను మండలంలోని తపాలపూర్ గ్రామంలోని తన నివాసంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

● దోమల నివారణ మందు పిచికారీ

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్, కుశ్నపల్లి ఆశ్రమ పాఠశాలలతో పాటు కేజీబీవీ ఎస్సీ హాస్టళ్లలో మంగళవారం ఏసీఎం దోమల నివారణ మందును మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది పిచికారీ చేశారు. సూపర్‌వైజర్ సుశీల, హెల్త్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● డైరెక్ట్ పంపింగ్ సిస్టం ప్రారంభం

తాండూర్: మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీలో డైరెక్ట్ పంపింగ్ సిస్టంను మంగళవారం డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు.

'వ్యసనాలకు అలవాటు పడొద్దు'

లక్సెట్టిపేట: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడొద్దని ఏజీపీ వేల్పుల సత్యం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని, డ్రగ్స్ ఇతర వ్యసనాలకు బానిసై భవిష్యత్తును కోల్పోవద్దని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

గోరింటా సంబురం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆషాఢమాసంను పురస్కరించుకొని గోరింటాకు సంబురాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ అనూష విద్యార్థినులకు ప్రయోజనాలను వివరించారు.